నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
nipuna
Every Wednesday Free Suppliment
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
1 మే 2024
పేజీలు 8




# ఐఐటీల్లో ప్రవేశాలు

# జేఈఈ అడ్వాన్స్‌డ్ -2024

**దేశంలో ఇంజనీరింగ్ విద్యకు అత్యంత పేరుగాంచిన విద్యాసంస్థలు ఐఐటీలు. ఈ సంస్థల్లో సీటు సంపాదించడానికి లక్షలాదిమంది విద్యార్థులు అహర్నిశలు శ్రమిస్తుంటారు. నిజానికి మిగిలిన అన్ని ప్రవేశపరీక్షల కంటే భిన్నమైనది జేఈఈ అడ్వాన్స్‌డ్. ప్రపంచంలో కఠినమైన పరీక్షల్లో ఒకటిగా పేరుగాంచిన జేఈఈ అడ్వాన్స్‌డ్ దరఖాస్తు ప్రారంభమైంది. జేఈఈ మెయిన్ పరీక్షలో టాప్‌లో నిలిచిన సుమారు రెండున్నర లక్షలమంది రాసే పరీక్ష ఇది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో వచ్చిన మార్కులు, ర్యాంక్ ఆధారంగా దేశంలోని 23 ఐఐటీల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. అడ్వాన్స్‌డ్ పరీక్ష వివరాలు సంక్షిప్తంగా ...**



**ఐఐటీలు:** ప్రపంచవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యకు పేరుగాంచిన సంస్థలు. అంతేకాదు దేశంలో జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రఖ్యాత సంస్థలు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ).

- స్వాంత్రత్యం వచ్చిన తర్వాత ప్రామాణికమైన ఇంజినీరింగ్ విద్య కోసం ఐఐటీ ప్రతిపాదన వచ్చింది. దీంతో 1954లో మొట్టమొదట ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రారంభించారు. తర్వాత ఒక్కొక్కటిగా పెంచుకుంటూ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 23 ఐఐటీలను కేంద్రం నెలకొల్పింది.

**ఐఐటీల లక్ష్యం**

- ఆలోచనా స్వేచ్ఛను ప్రోత్సహించే వాతావరణం సృష్టించడం, దానిని కొనసాగించడం, ఆయా రంగాల్లో శ్రేష్ఠతను సాధించడానికి అవసరమైన స్వీయ క్రమశిక్షణను పెంపొందించుకునే సమర్థత, శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం కోసం బలమైన పునాదిని నిర్మించడానికి, సమర్థులైన, మోటివేటెడ్ ఇంజినీర్లను, శాస్త్రవేత్తలను సిద్ధం చేయడానికి, విద్యార్థులను ఎంట్రపెన్యూరియల్ స్ఫూర్తిని నింపడం కోసం, దేశ నిర్మాణంలో సహకారం అందించేందుకు విద్యార్థులను అత్యుత్తమ నిపుణులుగా తీర్చిదిద్దడం ఐఐటీల ప్రాథమిల లక్షణం.

**జేఈఈ అడ్వాన్స్‌డ్**

- ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్ష ఇది. మొదట జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించాలి. మెయిన్ పరీక్షలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా టాప్-20 అంటే సుమారు 2.50 లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు.

## అందించే కోర్సులు

- నాలుగేండ్ల బీటెక్, బీఎస్
- ఐదేండ్ల బీఆర్క్
- ఐదేండ్ల డ్యూయల్ డిగ్రీ (బీటెక్-ఎంటెక్), బీఎస్-ఎంఎస్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ. పై కోర్సుల్లో సుమారు 130 రకాల బ్రాంచీలు (సబ్జెక్టు) ఉన్నాయి.

**అర్హతలు:** 2023, 2024లో ఇంటర్ ఉత్తీర్ణులు. ఇంటర్‌లో ఎంపీసీ చదివి ఉండాలి. జేఈఈ మెయిన్-2024లో టాప్ 2,50,000లో ఉండాలి. (రిజర్వేషన్లు వర్తిస్తాయి)

**వయస్సు:** 1999, అక్టోబర్ 1న లేదా తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు అయితే 1994, అక్టోబర్ 1న లేదా తర్వాత జన్మించి ఉండాలి.

**నోట్:** గరిష్ఠంగా రెండుసార్లు మాత్రమే రాయడానికి అర్హులు.

**పరీక్ష విధానం:**

- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు.
- రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1 ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు రెండు పేపర్లను తప్పనిసరిగా రాయాలి. పీహెచ్‌సీ అభ్యర్థులకు ఒక గంట అదనపు సమయాన్ని ఇస్తారు.

- జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంక్ ద్వారా ప్రవేశాలు కల్పించే సంస్థలు
- 23 ఐఐటీలు, బెంగళూరులోని ఐఐఎస్సీ, దేశంలోని ఏడు ఐఐఎస్ఈఆర్‌లు, తిరువనంతపురంలోని ఐఐఎస్టీ, రాయబరేలీలోని ఆర్‌జీఐపీటీ, విశాఖపట్నంలోని ఐఐపీఈ.

- నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంటుంది. వివరాలు ప్రశ్న పత్రంలో ఇస్తారు.
- రాష్ట్రంలో పరీక్ష కేంద్రాలు హైదరాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, మహబూబ్ నగర్, నల్లగొండ, నిజామాబాద్, సత్తుపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్‌లో ఉన్నాయి.

**నోట్:** ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏఏటీ)

- బీఆర్క్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం దీన్ని నిర్వహిస్తారు. ఎవరైతే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో అర్హత సాధిస్తారో వారు మాత్రమే ఏఏటీ రాయడానికి అర్హులు.
- బీఆర్క్ ప్రోగ్రామ్‌ను ఐఐటీ వారణాశి, ఖరగ్‌పూర్, రూర్కీ మాత్రమే అందిస్తున్నాయి.
- ఏఏటీ పరీక్షకు సంబంధించిన వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

## ముఖ్యతేదీలు

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మే 7
- **పరీక్షతేదీ:** మే 26
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** మే 10
- **ఫలితాల వెల్లడి:** జూన్ 9
- **వెబ్‌సైట్:** https://jeeadv.ac.in

కేశవపంతుల వేంకటేశ్వరశర్మ